


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### మేరీకుచ్ సామాన్..

**పొద్దుటే** లేచి వేపచెట్టునుండి పందుం పుల్లలు విరుస్తున్న సందానీని చూసి, బ్రష్ చేస్తూ, వాడిముందు దొరసానిలా ఫీల్ అయిపోతూ, "ఎందుకురా? అన్ని పందుం పుల్లలు? ఒకేసారి అన్నాను" అక్కడ మోపులా పేర్చాడు రెండు కట్టలు అప్పటికే.

"నేనూ అమ్మీజాన్ బువాకీ ఘర్ పోతున్నాం, తాత చాలా బీమార్ వున్నయ్.. ఎక్కువ దినాలుండడు.. సూసి రావాలె" అన్నాడు గంభీరంగా.

నేను బాధగా చూసి "సారీ రా! బాధపడకు.. డబ్బులేమైనా కావాలా?" అన్నాను. నా గల్లాలో ఐదు రూపాయిల పావలా దాకా పావలా బిళ్ళలున్నాయి అని. వాడు ముందురోజే టంగ్ బద్దతో తీసి చూసి, మళ్ళీ అందులో వేసేసాడు.

"నాది అబ్బా జాన్ తాన యాభై రూపాల్ తీస్కున్నాం"

"అబ్బో! చాలా డబ్బులే ఇచ్చాడు మీ అబ్బా జాన్" అన్నాను.

సందానీ చిరాగ్గా, పందుంపుల్లలు మోపు కడ్తూ "తీస్కున్నా అన్నా. ఇచ్చిండు అనలే" అన్నాడు.

అర్థమైంది నాకు. లేచి చూసుకుంటే, వీపు విమానం మోత మోగిస్తాడు.

"అయినా ఇన్ని పందుం పుల్లలెందుకురా? ఉన్నవి 28 పళ్ళు.. ఎప్పుడూ ముందు నాలుగూ వుండవు" అన్నాను.

వాడికి కోపం వచ్చింది. "నీదీ తింగరి. నేనూ పోతా పోతా బస్ డిపోల ఇవి పదిపైసల కొక కట్ట అమ్మి పోతా" అన్నాడు.

నాకు వాడిలో ఒక ఇన్ఫోసిస్ నారాయణ మూర్తిగారు, స్టీవ్ జాబ్స్ కనిపించాలి. కానీ ఆ వయసులో వాళ్ళెవరూ తెలీక, "గడ్డమీద మల్లయ్య సేట్ అంత గొప్పవాడివి అవుతావు రా పెద్దయ్యాకా" అన్నాను.

"ఏ.వీ రమణీ, నాదీ చాందినీకి చూస్కో.." వాడికి కళ్ళనుండి నీళ్ళు కారిపోతుంటే, మోచేత్తో తుడుచుకున్నాడు.

"అసలే నోరులేదు" అన్నాడు.

"ఎందుకు లేదు? శాస్త్రిగారి పై గుడ్డకూడా తినేసిందిట. దానికి నీకున్నంత ఆకలుంది. అయినా నేను చూస్కుంటాలే బన్ రొట్టెలు కొనాలా ఏవన్నానా? మా వేపచెట్టు వుండనే వుంది" అని పళ్ళు తోముకుంటూ నిలబడ్డాను.

సందానీ సీనారేకు పెట్టెకి బంతిపూరంగు వేసి బయట ఆరబెట్టాడు. అందులో వాడు చింకివీ, పాతవీ అయిన వాడి నాలుగు చొక్కాలూ, ఆకాశం కింద పడుకుంటే బిర్లా ప్లానిటోరియంలో పడుకున్నట్లు, చిల్లులతో కూడిన నల్లని రగ్గూ, పిట్టలదొర టోపీ, ఆడుకునే గిల్లీ దండు సరంజామా, గోళీలూ, ఉండేలూ, వాడు చేపలు పట్టడానికి తయ్యారు చేసుకున్న గాలం, వూచలు బయటకి పొడుచుకొచ్చిన గొడుగూ, వర్షాకాలం వీడు రెయిన్ కోటులా వేసుకునే గోనె సంచీ ఒకటేమిటి, ఆ పెట్టె పొట్ట పగలేలా, సమస్త సామాన్లూ అందులో కుక్కాడు. రెండు డబ్బాల్లో వీడు పోసేసిన గచ్చకాయ రాళ్ళూ, పత్తాలూ, ఇతర ఆట సాంగ్రీ నా దగ్గరకి తెచ్చి, ఒక గోతాంలో వేసి ఇస్తూ "ఇది అబ్బాస్‌గాడొచ్చి అడిగితే, వానికి ఇవ్వకు. వాడు ఒట్టి బద్మాష్" అన్నాడు.

"మేరీ కుచ్ సామాన్.. తుమ్మారా పాస్ హై" అని అనురాధా పాటిల్ ఇజాజత్‌లో పాడే పాట గుర్తొచ్చింది. వాడి ఆస్తిని భద్రంగా కాపాడ్తానని మాటిచ్చాను. అమ్మీజాన్‌కి కూడా ఒక గోతాం సంచి నిండా సామాన్లు సర్దాడు.

"అసలు తిరిగి రారా ఏవిటి? అన్ని సామాన్లు ఎందుకు?" అన్నాను. దొడ్లో నేలలో పాతేసిన రోలు తప్ప, అన్నీ సర్దాడు.

"ఈడ వదిలితే అబ్బా జాన్ అమ్మేస్తాయి" అన్నాడు గిన్నెలూ, చెంబులూ అమ్మేసే అబ్బాజాన్‌ని ఇక్కడే చూసాను.

మొత్తానికి బోలెడు సామాన్లు రిక్షాలో పెట్టుకుని, వెళ్తూ వెళ్తూ సందానీ "నాకీ తాత సచ్చిపోతే నెలదినాల తర్వాత వస్తాయి.. చాందినీ జాగ్రత్త. సొరకాయ దానికి మస్తు ఇష్టం. సిక్కుడు కాయ బీ! అని అప్పగింతలు పెట్టి, దాని మెడ కావిట వేసుకుని, లైలా మజ్నూలో నాగేశ్వరావులా ఏడుస్తూ వెళ్ళాడు.

రిక్షాలో సామానంతా వేసాక, అమ్మీజాన్ సీటు మీద కూర్చుంటే, వాడు వెనకాల పరిగెడ్తూ వెళ్ళాడు.

నాకీ సామాన్లు సర్దడం, పరచడం అంటే విపరీతమైన చిరాకు చిన్నప్పటినుండీ వుండేది.

అనకాపల్లి మావయ్య మా ఇంటికి ఏ కోర్టు పనులమీదో వస్తే, ఆయన పాత ధోవతులు నాలుగూ, నీరకావి రంగువి, గాలికి రెపరెపా ఎగుర్తూ, జాతీయ పతాకంలా మా వీధి వసారాలో ఆరేసేవాడు. ఉద్ధరిణి, పంచపాత్ర, పళ్ళెం తులసికోట దగ్గర బోర్లా వేసేవాడు, సంచిలో తెచ్చుకున్న కచ్చూరాలు, లవంగాలు, ఒక సీసాలో శొంఠిపొడి, కరక్కాయ పొడి, కరివేపాకు పొడి, నా శ్రాద్ధం నావల్లకాడూ పొడులలాంటివి బోలెడు అల్మారాల నిండా పెట్టేవాడు. ఇంక విరిగిన పీట చెక్కా, విసినకర్రతో సహా అన్నీ తక్కువ కాకుండా తెచ్చుకునేవాడు.

ఉండేదేమో నాలుగురోజులు అటో రోజూ, ఇటో రోజూ ప్రయాణం, "వదినా ఆవుపేడ ఎక్కడ దొరుకుతుందీ? గాడిదపాలు ఏమైనా దొరుకుతాయా? లేత తోటకూరకాడలు ఏవైనా తెప్పిస్తావేంటీ? నువ్వుల నూనెతో తప్ప తిరగమోతలు నిషిద్ధం. ఆవాలు జాస్తీ వాడద్దు వదినా..ఊష్ణం. వెల్లుల్లీ వుల్లీ మడికి పనికిరాదు, వంకాయ వాతం, ఆనపకాయ జలుబు.." ఇలా వుండేవి ఆయన డిమాండ్లు అమ్మమ్మతో.

అదే మా అమ్మమ్మ మేనకోడలు, మా సరోజిని అమ్మమ్మ వస్తే, పెట్లో ఓ చీరా రవికే, దండెం మీద ఓ చీరా రవికేనూ. స్నానం చేసి, వెంటనే చీరా రవికా ఆరేసేది. ఆవిడ పెట్టెలో చిన్న సందుం పెట్టి, అందులో అద్దం వున్న వైపు చూసుకుంటూ, మొహాన తిరుచూర్ణం పెట్టుకునేది, కొబ్బరినూనె సీసా తీసి జుట్టుకి పట్టించేది, అంతా ఇంతా జుట్టుకాదు, బారెడు జడ. వరండా అంతా పరుచుకున్న జుట్టుని అల్లి ముడి చుట్టేది. ఆ మెడ ఎలా భరించేదో పాపం. అందులోనే

పాన్‌దాన్ పెట్టె, పోకలు సన్నగా కత్తిరించడానికి అడకత్తెరా, ఆకులూ, సున్నం, కత్తా, లవంగాలూ, ఇలాచ్చీలూ వుండేవి. చీర మడతల్లో గంధపు వాసన వేసేది. దస్తీలు తెల్లగా వుతికి మడతలు వేసి, కొంచెం టాల్కం పౌడర్ జల్లి పెట్టుకునేది. ఓ భరిణలో మధ్యాహ్నాలు నోట్లో వేసుకునే నిమ్మతొనలు, మరో పక్క అమృతాంజనం ఆముదం సీసా, పొందిక అంటే ఆవిడా, ఆవిడంటే పొందికా .. అలా వుండేది.

అప్పడాలు వత్తితే అన్నీ ఒకే సైజులో గుండ్రంగా, దోశ వేస్తే చందమామల్లా, అన్నీ ఒకే రంగులో వేగి, ఇక వెల్లుల్లిపాయలేసి పప్పుచారు పెడితే వీధి చివరి వరకూ వేసేది ఆ సువాసన. కొత్తిమీర కారం నూరితే తవ్వెడు బియ్యపు అన్నం తినేయచ్చు. అంత బావుండేది. కొంతమంది మనుషులు కనపడుతూవుంటే విలువ తెలీదు. కనుమరుగైపోయాకా అనుక్షణం జ్ఞాపకాలు వెన్నాడుతాయి. అటువంటి వాళ్ళల్లో ఆవిడొకత్తీ.

వచ్చిన పూట వదిలేస్తే, సాయంత్రం నుండే పెరట్లో పొయ్యి పెట్టి, వంట చేస్తూ కనపడేది. మా అక్క చెల్లెళ్ళందరి పెళ్ళిళ్ళలో స్టోర్ రూం ఇన్‌ఛార్జ్ ఆవిడే వంట క్రిష్ణ మూర్తితో భేటీ పడేదీ ఆవిడే "ఇందాకేగా నూనె డబ్బా తీసుకెళ్ళావ్? అంతలోకే ఏం చేసావ్?" అని అరిస్తే "కూసుని తాగి పూడ్సినాను.. ఏం సెప్తావు మా!" అనేవాడు కోపంగా. ఇద్దరికీ అది మామూలే. లేక పోతే పెళ్ళి సందడేం వుంటుందీ. గంధపు వుండలూ, అక్షింతల బియ్యం, తలంబ్రాల బియ్యం, పీట మీద పోసే బియ్యం ఇలా వివరంగా చాక్‌పీస్‌తో రాసి డబ్బాల్లో సర్ది పెట్టేది. చల్ల మిరపకాయలు, కూర వడియాలు, అప్పడాలు ఎన్ని పనులో పెళ్ళికి నెలముందు నుండీ, ఒక్క క్షణం కూర్చునేదికాదు. ఏ ఆవాలో మెంతులో పీట పెట్టుకుని, ధారగా పోస్తూ, బాగుచేస్తూ చెరుగుతూ కనిపించేది మధ్యాహ్నాలు. అయినా నోరు మాత్రం కబుర్లు చెప్తూనే వుండేది.

ఆవిడ పొందిక గురించి ఇవన్నీ చెప్పుకొచ్చాను. ఇంక మనం ఒక రాత్రి ప్రయాణం చేసి, దిగవలసిన మజిలీలో దిగే ప్రయాణం గురించి చెప్తాను. కొంతమంది రైలు ఎక్కగానే, పెట్టెలు ధబేలు ధబేలుమని బెర్తుల మీద నుండి పెద్ద చప్పుడు చేస్తూ కింద కూర్చున్న వాళ్ళ నెత్తుల మీద పడేసినంత పనిచేస్తూ, తెరిచి, అందులోంచి లుంగీలు తీసి కట్టుకుంటారు, షూష్ వుంటే, అవి విప్పి ఆకు చెప్పులు వేసుకుంటారు. గొడుగూ, మంచినీళ్ళ సీసాలు వంకీలకి తగిలిస్తారు. చొక్కాలు కూడా విప్పి కొంతమంది తగిలిస్తారు. ఇంక కొంతమంది ఎక్కిన అరగంటకి, కేరియర్లు విప్పి, కంచాలూ, స్పూన్లూ తీసి, ఇంట్లోలాగే ఏ కొరతా లేకుండా అన్నం కూరలూ కారిపోయే సాంబార్లూతో సహా వడ్డించుకుని, బ్రేవ్‌మని తేనుస్తు, మెతుకులు కిందంతా పోస్తూ భోజనాలు చేస్తే, పల్లీలు వలుచుకుని, తొక్కలు కింద పోస్తూ, అరటిపండు తొక్కలు సైతం వేస్తూ, తినేవారు కొందరు. ఊరగాయలు తీసి, ఊటకార్చేవారు ఇంకొందరూ, పై బెర్త్‌ల మీద పసిపిల్లలతో పడుకుని, కింద బెర్తువారిని అభిషేకించేవారు ఇంకొందరూ.


అసలు వీళ్ళు పొద్దుట గమ్యం వస్తే దిగరా? ఇక్కడే కొన్నాళ్ళు వుంటారా? ఎప్పటికప్పుడు ఇది పర్మనెంట్ అనుకుంటారా? ఎంత అజ్ఞానం? అనిపిస్తుంటుంది నాకు. మళ్ళీ ఏ తెల్లవారు ఝామునో లేచి, బాత్ రూమ్‌ల దగ్గర ఖాండ్రింపులతో దంతధావనం చేసి, టవల్‌తో తుడుచుకుని, సూట్ కేసులు తీసి, ఇవన్నీ సర్దుకుని, ఆరేసిన తువ్వాళ్ళు, పరిచేసిన సామాన్లు, తినేసిన ఎంగిలి ప్లేట్లు తగిలించిన గొడుగులూ, గట్రా.. ఎంత ఆదరాబాదరా, ఎంతపనీ? ఎంతమంది నెత్తులు చితుకుతాయీ, కాళ్ళు తొక్కబడతాయీ, కంపార్ట్‌మెంట్‌లో ఎంత గొడవా. రణగొణ ధ్వనీ.. జీవితం పద్ధతిగా, పొందిగ్గా, సాఫీగా వుండాలంటే ఎలా వుంచుకోవాలీ?

మొన్న ఓ స్నేహితురాలితో కథా చర్చల గురించి నొవాటెల్ హోటల్‌లో మూడు రోజులు వున్నప్పుడు అదే చెప్పాను. నా బట్టలు మార్చుకునేవి పైకొస్తాయి. విప్పినవి కింద కొస్తాయి. మందులు వేళకి సూట్‌కేస్ తీసి వేసుకుని, మళ్ళీ

యధాస్థానంలో పెట్టేస్తాను, టాయ్‌లెట్ సామాన్లూ, బ్రష్‌లూ, పేస్టులూ పరచను టాయ్‌లెట్‌లో. వాళ్ళు ఎంత పరిశుభ్రంగా, అందంగా ఇచ్చారో మనమూ అలాగే వుంచుదాం. బట్టలు విప్పి పారెయ్యకూడదు రూం అంతా. తడి తువ్వాళ్ళు ఆరేసెయ్యొచ్చుకానీ మడిచి మంచాల మీద పారెయ్యకూడదు. నేను ఆటా తానాలకి వెళ్ళినప్పుడు కూడా ఓ చిన్న హేండ్ లగేజ్‌లో పట్టు చీరలూ, జ్యువెల్రీ తీసుకుని వెళ్ళేదాన్ని. స్టార్ హోటల్సే ఇస్తారు. గబుక్కున ఎవరైనా వస్తే నా రూంలో నేను ఇబ్బందిపడేట్లు, చిరాగ్గా, అస్తవ్యస్తంగా నా బట్టలూ, సామాన్లూ కనిపించేవికావు. అన్నీ గుంభనంగా పెట్టెల్లోనే వుండేవి.

తద్వారా నేను చెప్పేదేంటంటే జీవితం క్షణభంగురం. పిలుపొస్తే అన్నీ రెడీగా పెట్టుకుని వెళ్ళేట్లుండాలి "ఆగాగు దేవుడా.. దండెం మీద చీర ఇంకా ఆరలేదు. మాగాయలో నూనె కాచి పెట్టాను. చల్లారాక పోసేసి వస్తాను. ఇల్లంతా కంగాళీగా నా సామాన్లు పరిచేసుకున్నాను. సర్దుకుని వస్తాను. పిల్లలకి ఏ డబ్బాల్లో ఏం పోసి పెట్టానో చెప్పి వస్తాను. ఆకలి పడి వస్తారు పాపం. చిన్న కోడలికివ్వాల్సిన ముక్కుపుల్ల ఇంకా కంసాలి దగ్గరే వుంది. కూతురికి పండక్కి కుట్టాల్సిన జాకెట్టు ముక్కలు కత్తిరించి పెట్టాను. అంటే దేవుడు ఆగడు. అన్నీ ఎప్పటికప్పుడు సర్దుకుని పొందిగ్గా రెడీగా వుంటే వీళ్ళు 'ఎవరెడీ' బాటరీలాంటివాళ్ళు వీళ్ళ ట్రయిన్ ఎప్పుడైనా ఫర్లేదు. ముందు కంగాళీ బ్యాచ్‌ని తొందరపెట్టి బండెక్కిద్దాం." అనుకుంటాడు దేవుడు. వాళ్ళకి చాలా టైం కావాలి కదా మరి. ఇదండీ ధర్మ సూక్ష్మం...

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4